@netifocusnews @focustv
https://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

COMPLIMENTARY COPY

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: ఎం. తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | ఆదివారం, 21 జనవరి 2024 | పేజీలు - 4



## రూ.40,232 కోట్ల పెట్టుబడులు

# 200 సంస్థలతో సంప్రదింపులు

## సీఎం దావోస్ టూర్ సక్సెస్

2లో

తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రాబోతున్నాయి. ఇన్వెస్టర్లను ఆకర్షించే విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించాయి. తెలంగాణకు భారీ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి బృందం.. రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. మూడు రోజుల పర్యటనలో వివిధ కంపెనీలకు చెందిన 200 మంది ప్రతినిధులతో సమావేశమయ్యారు. గత ఏడాదిలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే ఈసారి రెండింతలు పెరిగాయి. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతమైంది.

*- నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20*

## మాజీ సీఎం కేసీఆర్‌కు..

# అయోధ్య ఆహ్వానం

శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తరపున ఆహ్వానం



2

## జగన్ దోచేది ఎక్కువ..

# జనాలకు ఇచ్చేది తక్కువ

చంద్రబాబు ఆరోపణ



# బీఆర్ఎస్‌ను బొందపెట్టి తీరుతాం

- పులి బయటకు వస్తే బోనులో పడేస్తాం
- కేటీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ గట్టి కౌంటర్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20:** వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరింతగా బొందపెట్టడం ఖాయమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా నెట్టే ఛాన్స్ లేదని లండన్ పర్యటనలో ఉన్నారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. పులి బయటికొస్తుందని ఇటీవల వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు.



2లో

## ఖైరతాబాద్ హనుమాన్ ఆలయాన్ని

# శుభ్రం చేసిన గవర్నర్ తమిళిసై

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:** గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఖైరతాబాద్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం లక్ష్మణ సమేత సీతారాములను దర్శించుకున్నారు. నవగ్రహ ప్రదక్షిణ చేశారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశంలో ఉన్న అన్ని ఆలయాను శుభ్రం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ అభియాన్ చేపట్టారు. అయోధ్యలో శ్రీరామమందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను శుభ్రం చేయాలని దేశ ప్రజలను ప్రధాని మోదీ అభ్యర్థించారు. జనవరి 22 నాటికి దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, దేవాలయాలను శుభ్రం చేయాలని, స్వచ్ఛతా ప్రచారాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 12న మహారాష్ట్రలోని నాసిక్‌లో పర్యటించిన ప్రధాని.. శ్రీ కాలారామ్ ఆలయాన్ని శుభ్రం చేసిన విషయం తెలిసిందే.





# మీ హామీల సంగతేంటీ.?

## సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడిన మాజీ మంత్రి కేటీఆర్

బీఆర్ఎస్‌ను 100 మీటర్ల లోపల బొంద పెడ్తానన్న సీఎం రేవంత్ రెడ్డిపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. తెలంగాణ తెచ్చినందుకా.. తెలంగాణను అభివృద్ధి చేసినందుకా లేక మిమ్మల్ని, మీ దొంగ హామీలను ప్రశ్నిస్తున్నందుకా అని నిలదీశారు. 100 మీటర్ల లోపల బీఆర్ఎస్‌ను బొంద పెట్టే సంగతి తర్వాత చూసుకుందాం కానీ, వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీల సంగతేంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు.

*- నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్*

2లో..

## బియ్యం గింజలతో..

# అయోధ్య నమూనా

గిన్నిస్ రికార్డ్ హోల్డర్, డాక్టర్ గుర్రం దయాకర్ ప్రతిభ



## మాజీ సీఎం కేసీఆర్‌కు అయోధ్య ఆహ్వానం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20:** ఈనెల 22వ తేదీన అయోధ్యలో జరిగే రామమందిరం ప్రారంభోత్సవా నికి రావాల్సిందిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తరఫున ఆహ్వానం పంపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయపార్టీలకు, ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రముఖులందరిని ట్రస్ట్ ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు కూడా ఆహ్వానపత్రం పంపించారు. అయితే, ఆయనకు ఇటీవలే తుంటి ఎముక ఆపరేషన్ జరిగినందున కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## జగన్ దోచేది ఎక్కువ.. జనాలకు ఇచ్చేది తక్కువ

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏపీలో దోచుకునేది ఎక్కువ.. జనాలకు ఇచ్చేది తక్కువని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించారు. టీడీపీ ఆధర్యంలో అరకులో నిర్వహించిన ' రా..కదిలి రా' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ జీవో నంబర్ 3 ను ఎందుకు రద్దు చేశారని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని జీవో 3ను తీసుకొస్తే దానిని రద్దు చేయడం సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. . టీడీపీ అధికారంలోకి రాగానే జీవో నంబర్ 3ను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో తాము గిరిజనుల కోసం 16 పథకాలు ప్రత్యేకంగా ప్రవేశపెట్టామని , వాటిని వైసీపీ రద్దు చేసిందని విమర్శించారు. గిరిపుత్రిక కల్యాణ పథకాన్ని రద్దు చేశారని ఆరోపించారు. గిరిజనుల సహజ సంపదను దోచుకునే వ్యక్తి జగనని మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలో ఎక్కడైనా రహదారి వేశారా అని నిలదీశారు. ఎన్నో కాఫీలు ఉన్నా, అరకు కాఫీకి ప్రత్యేకత ఉందని, భవిష్యత్‌లో అరకు కాఫీని ప్రపంచం మొత్తానికి తీసుకెళ్తామన్నారు. టీడీపీ అరకు కాఫీని ప్రమోట్ చేస్తే వైసీపీ గంజాయిని పరిచయం చేస్తోందని ఆరోపించారు.

## బియ్యం గింజలతో అయోధ్య నమూనా

**● గిన్నిస్ రికార్డ్ హోల్డర్, డాక్టర్ గుర్రం దయాకర్ ప్రతిభ**



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20:** ఈ నెల 22న అయోధ్య రామ మందిరంలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో స్వర్ణకారులు, సూక్ష్మ కళాకారులు, నేత కార్మికులు తదితరులు తమతమ కళా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. శ్రీరాముడు, సీతాదేవి, అయోధ్య రామాలయం ఇలా తమకు తోచిన నమూనాలను రూపొందిస్తూ రామయ్యపై భక్తిని చాటుకుంటున్నారు. తాజాగా ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, గిన్నిస్ రికార్డ్ హోల్డర్, డాక్టర్ గుర్రం దయాకర్ బియ్యం గింజలతో అయోధ్య రామాలయ నమూనాను రూపొందించారు. ఈ రామాలయ నమూనా రూపకల్పన కోసం డాక్టర్ దయాకర్ ఏకంగా 16 వేలకు పైగా బియ్యపు గింజలను వినియోగించారు. ఈ కళాఖండాన్ని దయాకర్ దేశ ప్రధాని నరేంద్ర మోదీకి అందజేయనున్నారు. ఈ కళాఖండం రూపకల్పనపై ఆయన మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ అకుంఠిత దీక్షవల్లనే ఇప్పుడు రామాలయ నిర్మాణం జరిగింది. ఇది భారతదేశానికి గర్వకారణం. సనాతన ధర్మం గొప్పతనం. ఈ సందర్భంగా ఒక సూక్ష్మ కళాకారుడిగా, రామ భక్తునిగా ఈ కళాఖండాన్ని రూపొందిం చాను అని తెలిపారు. 16 వేలకు పైగా బియ్యపు గింజలతో రూపొందించిన ఈ కళాఖండాన్ని ప్రధాని మోదీకి అందజేస్తా. ఈ కళాఖండాన్ని తయారు చేయడానికి 60 గంటల సమయం పట్టింది. ఇంత అద్భుతమైన కళాఖండాన్ని ఇప్పటివరకు ప్రపంచంలో ఎవరు తయారు చేయలేదు. ఈ కళాఖండాన్ని రూపొందించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని డాక్టర్ దయాకర్ చెప్పారు.

## బీఆర్ఎస్‌ను బొందపెట్టి తీరుతాం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20:** వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను మరింతగా బొందపెట్టడం ఖాయమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా నెట్టే ఛాన్స్ లేదని లండన్ పర్యటనలో ఉన్నారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. పులి బయటికొస్తుందని ఇటీవల వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. పులి బయటికి వస్తే బోనులో వేసి చెట్టుకు వేళాడదీస్తామని రేవంత్ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ తర్వాత అక్కడ ఉన్న తెలంగాణ వ్యక్తులు, కాంగ్రెస్ అభిమానులతో రేవంత్ భేటీ అయ్యారు. ఆ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ చుద్దామన్నా కూడా కనిపించదని వ్యాఖ్యానించారు. అంతేకాదు వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తే ఉండదని రేవంత్ అన్నారు. కేసీఆర్‌ను పులితో పోల్చిన కేటీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో రేవంత్ రెడ్డి లండన్ వేదికగా స్పందించారు. ఒక్క ఎన్నిక విషయంలోనే బీఆర్ఎస్ నేతలు బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఆహంకారం తగ్గలేదన్నారు. వారి గర్వం, అహంకారం తగ్గించే బాధ్యత తనదేనని రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలైన తర్వాత వారికి భయం పట్టుకుని ఇలా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు.

## ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం

**● అదేరోజు జెఎన్‌టియులో అవగాహన సదస్సు**

**● ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై హాజరు**

**● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడి**



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20:** రాష్ట్రంలో ఈనెల 25 వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం జరపడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారులను, జిల్లాల ఎన్నికల అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవాలకు –ఓటింగ్‌కు మించినదేదీ లేదు, నేను తప్పక ఓటేస్తాను అనే అంశాన్ని ఎంపిక చేశారు. కూకట్‌పల్లి జెన్‌టియు ఆడిటోరియంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈకార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరైతారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో విద్యాసంస్థలు మొదలైనవాటిని కూడా భాగస్వాములను చేయాలని, ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయిలో ఎన్నికల ప్రతిజ్ఞ తీసుకునేలా ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. బూత్ స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాలను నిర్వహించాలని డీఈఓలతో సహా సంబంధిత అధికారులందరికి రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్నికల సంఘం కార్యక్రమాలపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ఆయన ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విద్యాలయాల్లో డిబేట్లు, డ్రాయింగ్‌లు మొదలైన వాటిలో పోటీలు, అన్ని బహిరంగ ప్రదేశాలలో పోస్టర్లు, బ్యానర్‌లను ప్రదర్శించడం, సెమినార్లు, వెబ్‌నార్లు, ప్రకటనలు, ప్రచారాలు మొదలైనవాటిని నిర్వహించడం వంటివి చేపట్లనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో పోస్టల్, రైల్వేలు, పంచాయత్ రాజ్ సంస్థల వంటి ప్రభుత్వ సంస్థలను, సామాజిక సేవా సంస్థలు, ఇతర ప్రజాసంఘాలను కూడా నిమగ్నం చేయాలని సూచించారు. బూత్ లెవల్ అధికారి స్థాయిలో కొత్త ఓటర్లను సత్కరించి, వారికి కొత్త ఓటర్ ఎపిక్ కార్డులు జారీ చేయాలని, ఈ కార్యక్రమాలకు వీలైనంత ఎక్కువ ప్రచారం కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాలు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, నైతిక ఓటింగ్, ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లవంటి వాటికి స్థానిక భాషల్లో ప్రచారం కల్పించడానికి సమాచారాన్ని సృజనాత్మకంగా అభివృద్ధి చేయాలనీ, వాట్సాప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వాటిని ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల అమలుకు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఈవోలందరినీ ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు సిఇఓ లోకేష్ కుమార్, సర్ఫరాజ్ అహ్మద్, రోనాల్ రోస్, కలెక్టర్లు అనుదీప్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.40,232 కోట్ల పెట్టుబడులు..

# 200 సంస్థలతో సంప్రదింపులు..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20:** తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రాబోతున్నాయి. ఇన్వెస్టర్లను ఆకర్షించే విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించాయి. తెలంగాణకు భారీ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి బృందం.. రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. మూడు రోజుల పర్యటనలో వివిధ కంపెనీలకు చెందిన 200 మంది ప్రతినిధులతో సమావేశమయ్యారు. గత ఏడాదిలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే ఈసారి రెండింతలు పెరిగాయి. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతమైంది. తెలంగాణలో రూ. 12,400 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూప్ ముందుకు వచ్చింది. నాలుగు రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో అదానీ గ్రూప్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ, ఇంధన రంగంలో ఐదువేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడతామని అదానీ హామీ ఇచ్చారు. అదానీ గ్రూప్ తోపాటు, JSW, వెబ్ వర్క్స్, టాటా టెక్నాలజీస్, BL ఆగ్రో, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్, గోడి ఎనర్జీ, అరజెన్ లైఫ్ సైన్సెస్, ఇన్నోవెరా ఫార్మాస్యూటికల్స్, క్యూ సెంట్రియో, సిస్ట్రా, ఉబర్, ఓ9 సొల్యూషన్స్ తదితర కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధతను వ్యక్తం చేశాయి. JSW ఎనర్జీ తెలంగాణలో ఏకంగా రూ.9,000 కోట్ల పెట్టుబడితో 1,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంగల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. సీఎం రేవంత్‌తో JSW గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ సమావేశమైన అనంతరం ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. ఇక గోడి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తెలంగాణలో రూ.8,000 కోట్ల పెట్టుబడితో ఆర్ అండ్ డీతోపాటు గిగా సేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇక రాష్ట్రంలోని 50 ఐటీఐలలో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు టాటా గ్రూపు ముందుకొచ్చింది. వీటిలో కొత్త కోర్సులు, మాస్టర్ ట్రైనర్ల నియామకానికి రూ.1500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. మరికొన్ని సంస్థలు కూడా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ ఫోరమ్ లలో మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతుల పక్షాన నిలబడాలని ప్రపంచ దిగ్గజ కంపెనీలకు పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రక్రియకు సహకరించాలని కోరారు. మరో సదస్సులో మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఆసియా మెడికల్ టూరిజం రాజధానిగా మార్చడానికి హెల్త్ కేర్ ను సాఫ్ట్ వేర్ తో సమ్మిళితం చేయాలన్నారు. ఖరీదైన హెల్త్ కేర్ సేవల ఖర్చులను తగ్గించేందుకు అమెరికా, యూరప్ దేశాలు పని చేస్తున్నాయని అన్నారు. హెల్త్ కేర్ సేవలను అందరికీ అందుబాటులో ఉంచేందుకు, అధునాతన వైద్య సేవలను ప్రతి మారుమూల ప్రాంతాల ప్రజలకు చేరుకోడానికి డిజిటల్, సాంకేతికను ఉపయోగించాలని సీఎం అన్నారు. ముఖ్యమంత్రితో సమావేశమైన భారతీయ పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ బిజినెస్ లీడర్లందరూ తెలంగాణలో కొత్త ప్రభుత్వం అనుసరించిన వ్యాపారం, స్నేహ దృక్పథానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు.

దావోస్‌కు రావడం.. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన వ్యాపారవేత్తలను కలుసుకోవటం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'అభివృద్ధితో పాటు సంక్షేమం అందించాలంటే పెట్టుబడులు, వృద్ధి కలిసి రావాలి. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు నిరంతరం మా ప్రయత్నం కొనసాగుతుంది. పారిశ్రామికవేత్తలందరూ హైదరాబాద్ కు రావాలి..' అని స్వాగతం పలికారు. ఇక మూడు రోజుల దావోస్ పర్యటన ముగించుకుని లండన్ చేరుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. లండన్‌లోని ప్రఖ్యాత థేమ్స్ నది అపెక్స్ గవర్నింగ్ బాడీ అధికారులతో సమావేశమయ్యారు. మూసీ నది ప్రక్షాళన ఒప్పందంపై చర్చించారు. థేమ్స్ నది నిర్వహణపై అధ్యయనం చేసి మూసీ నది ప్రక్షాళనలో అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నారు సీఎం. మూసీ నది ప్రక్షాళనపై పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపారు అధికారులు. మరోవైపు లండన్ అర్బన్ లేఅవుట్ అభివృద్ధిపై ఏరియల్ స్టడీ కోసం లండన్ షార్డ్ వ్యూను సందర్శించారు సీఎం రేవంత్ రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్.

# మీ హామీల సంగతేంటి?

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:** బీఆర్ఎస్‌ను 100 మీటర్ల లోపల బొంద పెడ్తానన్న సీఎం రేవంత్ రెడ్డిపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. తెలంగాణ తెచ్చినందుకా.. తెలంగాణను అభివృద్ధి చేసినందుకా లేక మిమ్మల్ని, మీ దొంగ హామీలను ప్రశ్నిస్తున్నందుకా అని నిలదీశారు. 100 మీటర్ల లోపల బీఆర్ఎస్‌ను బొంద పెట్టే సంగతి తర్వాత చూసుకుందాం కానీ, వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీల సంగతేంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహక సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. రేవంత్ రెడ్డి లాంటి అహంకార నాయకులను టీఆర్ఎస్ పార్టీ తన ప్రస్థానంలో చాలామందిని చూసిందని వెల్లడించారు. మఖలో పుట్టి పుబ్బలో పోయే పార్టీ అని మీలాంటోళ్లు చాలామంది నీలిగిన్రు. అయినా రెండున్నర దశాబ్దాల పాటు నిలబడి, నీలాంటి వాళ్లను మట్టికరిపించిందన్నారు. 'పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీజేపీలు కలిసిపోతాయి. రేవంత్.. కాంగ్రెస్ పార్టీలో ఏక్ నాథ్ షిండేగా మారుతాడు. రేవంత్ రక్తం అంత బీజేపీదే. ఇక్కడ చోటా మోదీగా రేవంత్ రెడ్డి మారిండు. గతంలో అదానీ గురించి అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఈరోజు అదానీ కోసం వెంటపడుతున్నాడు. స్విట్జర్లాండ్?లో రేవంత్ రెడ్డి అదానీతో అలైబలై చేసుకున్నాడు. అదానీ–రేవంత్ రెడ్డి ఒప్పందాల అసలు లొగుట్టు బయటపెట్టాలి. రాహుల్ గాంధీ ఏమో అదానీ గురించి వ్యతిరేకంగా మాట్లాడితే.. ఈ రోజు రేవంత్ రెడ్డి అదానీ కోసం అర్రులు చేస్తున్నాడు. డబుల్ ఇంజన్ అంటే అదానీ, ప్రధాని అని వ్యాఖ్యానించిన రేవంత్.. ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్‌గా మారిండు. ఈ జనవరి నెల కరెంటు బిల్లులు ప్రజలు ఎవరూ కట్టవద్దు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్ పథకం




గృహజ్యోతి హామీని నెరవేర్చే దాకా బిల్లులు కట్టొద్దు. స్వయంగా ముఖ్యమంత్రి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లుగానే ఉచిత విద్యుత్ కోసం డిమాండ్ చేయాలి. కరెంటు బిల్లులు అడిగితే అధికారులకు ముఖ్యమంత్రి మాటలను చూపించాలి. సోనియా గాంధీ బిల్లు కడుతుందని ముఖ్యమంత్రి ఎన్నికల అప్పుడు చెప్పిండు. కరెంటు బిల్లు ప్రతులను సోనియా గాంధీ ఇంటికి, , 10 జన్‌పథ్‌కు పంపించాలి. హైదరాబాద్ నగరంలో ఉన్న ప్రతి ఒక్క మీటర్‌కి గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ అందించాలి. గృహ జ్యోతి కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయాలి.. ఇందులో కిరాయి ఇండ్లలో ఉండే వాళ్లకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలి. మహాలక్ష్మి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క మహిళకు రూ.2500 వెంటనే ఇవ్వాలి. ఇచ్చిన హామీలను తప్పించుకోవడానికి కాంగ్రెస్ చూస్తే వదిలిపెట్టే పరిస్థితి లేదు. బీజేపీతో బీఆర్ఎస్‌కు ఏరోజు పొత్తు లేదు.. భవిష్యత్తులోనూ ఉండదు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌కు గత ఐదేండ్లలో ఏం చేసిండో చెప్పాలి. కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్ది లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడితే, కిషన్ రెడ్డి సీతాఫల్ మండి రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్‌లను జాతికి అకింతం చేశారు. ఇదే అయన చేసిన అతిపెద్ద పని. బీఆర్ఎస్ కేసీఆర్ ఆధ్వర్యంలో 36 ఫ్లైఓర్లు కడితే.. ఉప్పల్, అంబర్‌పేట ఫ్లైఓవర్లు సంవత్సరాలైనా కట్టలేక చేతులెత్తేశారు.

రాష్ట్రంలో బీజేపీని అడ్డుకున్నది ముమ్మాటికి బీఆర్ఎస్ పార్టీనే. బీఆర్ఎస్ వల్లే బీజేపీ సీనియర్ నాయకులు హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో పోటీకి వెనుకంజ వేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేవలం ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమే అని గుర్తుంచుకోవాలి. ఓడినా గెలిచినా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజాపక్షమే. కేవలం 50 రోజుల కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి మొదలుకొని అనేకమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. రైతన్నలకు రైతుబంధు అందడం లేదు. మహిళలకు వాగ్దానం చేసిన రూ.2500 రావడం లేదు. ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నది. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు 420 హామీలు అని ప్రజలు గుర్తుంచుకోవాలి. వివిధ డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేసేదాకా వెంటాడుతాం' అని కేటీఆర్ అన్నారు.

## కాంగ్రెస్ వైపు ఎంఐఎం మొగ్గు ?


**● లండన్‌లో సిఎం రేవంత్‌తో అక్బరుద్దీన్ భేటీ**

**● రాజకీయ చర్చకు దారితీస్తోన్న సమీకరణాలు**



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి20:** పార్మలెంట్ ఎన్నికలకు ముందు తెలంగాణ రాజకీయాలు మారుతున్నాయి. లండన్ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డిని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ కలవడం రాజకీయంగా చర్చకు దారితీస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో అక్బరుద్దీన్ భేటీ కావడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని అక్బరుద్ధీన్ కలవడం పట్ల రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బొటాబోటీ మెజార్టీ ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చంటూ ప్రతిపక్షాలు హెచ్చరిక వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డిని ఎంఐఎం నేత అక్బరుద్ధిన్ కలవడం సహజంగానే కాంగ్రెస్, ఎంఐఎంలు పరస్పరం కలిసి నడుస్తాయన్న చర్చలను రేకెత్తించింది. ప్రస్తుతం అసెంబ్లీలో 119స్థానాల్లో కాంగ్రెస్‌కు 64, మిత్రపక్షం సీపీఐకి 1 స్థానం, ఎంఐఎంకు 7, బీజేపీకి 8, బీఆరెస్‌కు 39స్థానాలున్నాయి. బీఆరెస్, బీజేపీలు ప్రభుత్వాన్ని పడగొట్టే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరైనా చేజారినా రేవంత్ ప్రభుత్వం మైనార్టీలో పడే అవకాశముంది. అలాంటి పరిస్థితుల్లో ఎంఐఎం మద్దతు కీలకంగా మారనుంది. సాధారణంగా మజ్లిస్ వ్యూహం అధికార పార్టీతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండటం. కాంగ్రెస్ తోనూ అలాగే ఉంటుంది. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడేటప్పుడు మొహమాటాలు పెట్టుకోరు. ఏ స్థాయిలో అవకాశం వస్తే ఆ స్థాయిలో నిలదీస్తారు. కానీ బయట రాజకీయం మాత్రం భిన్నంగా ఉంటుంది. మజ్లిస్ పాతబస్తీలో తమ బేస్ ను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. అందుకే తెలంగాణ అధికార పార్టీతో సన్నిహితంగా ఉండి.. పాతబస్తీలోకి అడుగు పెట్టకుండా చూసు కుంటుంది. మిగతా తెలంగాణ మొత్తం ఆ పార్టకి మద్దతుగా ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీకి అలాగే మద్దతుగా నిలిచింది. కేసీఆర్ మళ్లీ సీఎం అవడానికి చాలా మద్దతు ఇచ్చింది. కానీ కాంగ్రెస్ విజయం సాధించింది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. బీఆర్ఎస్ పాత్ర పరిమితంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో పోటీ చేయాలన్న ప్రయత్నాలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో గల్లంతు అయ్యాయి. ఇప్పుడు మజ్లిస్ కు కాంగ్రెస్ తో సన్నిహితంగా ఉండటమే కీలకం. అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ ప్రచారం చేసినా ముస్లిం వర్గాలు బీఆర్ఎస్ వైపు కాకుండా కాంగ్రెస్ వైపు మొగ్గారని ఓటింగ్ సరళిని బట్టి అర్థమవుతుంది. అదిగాక బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పోరాడుతుంది. ఇండియా కూటమిని ముందుండి నడిపిస్తుంది. జాతీయ రాజకీయాలు బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమిలు అన్నట్లుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో బీఆరెస్, ఎంఐఎంలు ఏదో ఒక పక్షంకు ఎన్నికల ముందు లేదా తర్వాతా మద్దతునివ్వక తప్పని పరిస్థితి తలెత్తవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీ, బీఆరెస్‌ల మధ్య రాష్ట్రంలో త్రిముఖ పోటీ సాగనుంది. ఇంకోవైపు బీజేపీ, బీఆరెస్‌లు లోపాయి అవగాహనకు రావచ్చన్న ప్రచారం కూడా వినిపిస్తున్నది. తెలంగాణలో అధికార పార్టీగా కాంగ్రెస్ మెజార్టీ సీట్లు గెలుచుకుని అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు గాలి వాటం కాదని చాటల్సిన అవసరముంది. ఇటు రాష్ట్రంలోనూ, అటు జాతీయ స్థాయిలోనూ కాంగ్రెస్ విజయానికి మైనార్టీ ఓటర్ల అండ కూడా అవసరమే. ఎంఐఎంకు కూడా బీజేపీ ఓటమే ప్రధాన లక్ష్యమంటుంది. అందుకు పరస్పర రాజకీయ ప్రయోజనాల నేపథ్యంలో కాంగ్రెస్, ఎంఐఎంలు భవిష్యత్తు రాజకీయాల్లో కలిసి సాగాలన్న ఆలోచనకు రావచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్, అక్బరుద్దీన్‌ల భేటీ జరిగి ఉండవచ్చని, రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి సాగినా ఆశ్చర్యం లేదన్న ప్రచారం సాగుతున్నది. అయితే మజ్లిస్ ఎప్పుడూ ఏ కూటమిలో నేరుగా చేరదు.. తెర వెనుక సహకారంకు మాత్రమే పరిమిత మవుతుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఎంఐఎం శాసన సభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు లండన్ నగరంలో పర్యటించారు. లండన్ షార్డ్ ను సందర్శించారు. అక్కడ నుండి లండన్ అర్బన్ లేఔట్, అభివృద్ధిని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. 72 అంతస్తుల పైభాగంలో, 309 మీటర్ల పొడవు ఎత్తు నుండి , నిండుగా ఉన్న థేమ్స్ నది లండన్ ఉత్తరం వైపు ప్రాచీన నగరంతో ఆధునిక పశ్చిమ భాగాన్ని ఎలా కలుపుతుందో పరిశీలించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి, మూసీ రివర్ అభివృద్ధి చర్యల కోణంలోనే ఈ పరిశీలన చేశారు. అయితే దీని వెనుక రాజకీయం ఉందనే ప్రచారం సాగుతోంది.


## అయోధ్యలో భద్రత కట్టుదిట్టం



**నేటి ఫోకస్ న్యూస్, అయోధ్య,జనవరి20:** అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం కోసం యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తోంది. ప్రధాని మోదీ చేతుల మీదుగా 22న మధ్యాహ్నం ప్రాణ ప్రతిష్ఠ జరగనుంది. వేలాది మంది అతిథులు హాజరవనున్నారు. అయోధ్యలో ఉగ్రదాడి జరగొచ్చనే నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో ఉత్తరప్రదేశ్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఆలయం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. అయోధ్య రాములోరి ఆలయం వద్ద స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్–ఎస్ఎఫ్), సీఆర్పీఎఫ్, ప్రావిన్షియల్ ఆర్మ్‌డ్ కాన్‌స్టబ్యూలరీ (పీఏసీ), ఉత్తరప్రదేశ్ సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారు. ప్రాణప్రతిష్ఠ జరిగే సోమవారం 100 మంది ఎస్ఎస్ఎఫ్ కమాండోలు విధుల్లో ఉంటారు. వీరికి నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) శిక్షణ అందించారు. ఎస్ఎస్ఎఫ్ గార్డులు ఉగ్రవాద వ్యతిరేక వ్యూహాలను తిప్పికొట్టడంలో నిష్ణాతులు. 1990 నుంచి రామజన్మభూమి ప్రాంతంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది భద్రత కల్పించారు. ఇప్పుడు ప్రధాన ఆలయం వెలుపల విధులు నిర్వహించనుంది. రెడ్ జోన్‌లో పీఏసీ, యూపీ పోలీసులు, ఎస్ఎస్ఎఫ్ మొత్తంగా 1400 మందిని మోహరించామని ఎస్ఎస్ఎఫ్ మీడియా సెల్ ఇంచార్జ్ వివేక్ శ్రీ వాస్తవ తెలిపారు. ఎల్లో జోన్‌లో పీఏసీ, యూపీ సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారు. ఆలయ పరిసరాల్లో కొందరు ఎస్ఎస్ఎఫ్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తారు. అదనపు బలగాల సాయం కూడా తీసుకుంటారు. డ్రోన్లు, సీసీటీవీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నిరంతరం భద్రతను పర్యవేక్షిస్తారు. భద్రతా విధుల్లో స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కూడా పాల్గొంటుందని వివేక్ శ్రీ వాత్సవ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ప్రధాని భద్రత ఏర్పాట్లను ఎస్పీజీ పర్యవేక్షిస్తోంది. రామాలయ భద్రత విధుల్లో ఎస్పీజీ సిబ్బంది పాల్గొంటారు.

# సంపాదకీయం

## అయోధ్యపై అపశకునాలకు తావులేదు !



రామో విగ్రహవాన్ ధర్మః..అంటే మూర్తీభవించిన ధర్మస్వరూపుడు రామచంద్రుడు...రామయణం మొత్తం ధర్మపాలన, ధర్మబద్ధత గురించే చెబుతుంది. మనిషి నడవడిక మొదలు..ఎవరు ఎలా నడచుకోవాలో చెబుతుంది. రామయణం రాసిన వాల్మీకి మహర్షి నిజంగా గొప్పవాడు. రాముడు నడయాడిన అయోధ్య ఇప్పుడు పావన అయోధ్యగా మారుతోంది. ముష్కరుల దాడిలో భారతీయ హైదంవాన్ని దెబ్బతీసినా.. శతాబ్దాలుగా చేస్తున్న పోరాటలకు చరమగీతం పడింది. జగదానంద కారకా..జయ జానకి ప్రాణ నాయక ..శుభ స్వాగతం..ప్రియా పరిపాలక మంగళకరం నీరాక..మా జీవనమే పావనమవుగాక..అంటూ భక్తకోటి ఆశ్రీరాముడ్ని తలచుకుని పాడుతోంది. భవ్యరామమందిరంలో మన రామయ్య కొలువయ్యేనాటికి ఎన్నో అద్భుతాలు సాత్కారించబోతున్నాయి. ఆ అద్భుత మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరి ఘనతా ఉంది. అది ఓ ఆలయానికి సంబంధించిన గట్టం కాదు. మన తరతరాల సంస్కృతికి, వారసత్వ సంపదకు చిహ్నం. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. మనమంతా వెలుగుదివ్వెల్లా ముందుకు సాగాల్సిన సమయమిది.

అయోధ్యలో భవ్యమందిర నిర్మాణం జరిగింది. 22న మనమంతా ఎదురు చూస్తున్న మహాక్రతువు ప్రారంభం కానుంది. మన ధర్మాన్ని మనం నిలబెట్టుకుని సగర్వంగా ఆచరించే శుభ ఘడియగా దీనిని భావించాలి. ఇక్కడ తర్కాలకు, విమర్శలకు తావు లేదు. అయోధ్య ముహూర్తం సరైనదా కాదా అన్న వివాదాలకు సమయం కాదిది. ఎవరు ఈ కార్యక్రమాన్ని చేస్తున్నారన్న రాజకీయాలకు వేదిక కాదు. భారతీయులు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హైందవులంతా ఒక్కటై పిక్కటిల్లేలా రాముడికి వందనం చేయాల్సిన సమయమిది. ధర్మాన్ని కాపాడుతామని ప్రతిన చేయాల్సి సమయమిది. ఇక్కడ పండిత విమర్శలకు, రాజకీయ కుసంస్కా రాలకు ఆస్కారం లేదు. శతాబ్దాల కింద ముష్కరుల దాడిలో ధ్వంసమైన హైందవాన్ని పునరుద్దరించుకునే సమయం మాత్రమే. దీనికి మీనమేషాలు లెక్కించాల్సిన అవసరం లేదు. నిత్యం మనమంతా ఉదయం కోసం ఎదురు చూస్తాం. ఎదురు చూడాలి. ఈరోజుకంటే రేపు గొప్పది... ఎదురు చూడటంలో నమ్మకం ఉంది. ఆశ ఉంది. మనోబలం ఉంది. శ్రద్ధ ఉంది. ఇష్టం ఉంది. అపారమైన ప్రేమ ఉంది. బతకాలన్న కోరిక మెండుగా ఉంది. వసంతం కోసం కోయిల, కోయిల కోసం వసంతం ఎదురు చూస్తాయి. ఎంతో కష్టపడి తాను పోగుచేసిన తేనెను, మనిషి కోసం తేనెటీగ త్యాగం చేస్తుంది. ఆ సహజత్వంలో అపారమైన ప్రకృతి ప్రేమ ఉంది. కారణజన్ములను కన్న తల్లులు కూడా తొమ్మిది నెలలు తమ గర్భంలో మోసి వారి రాకకోసం ఎదురుచూస్తారు. ఈ 'రోజు' వెళ్లిపోతుంది. 'రేపు' చిరునవ్వులతో మనముందు సాక్షాత్కరిస్తుంది. కొత్త ఆశలు రెక్కలు తొడుక్కుని వస్తాయి. కొత్త చిగుళ్లతో చెట్లు ముస్తాబవుతాయి. కొత్త సూర్యుడు బంగారు పూలరథంమీద వస్తాడు. భవిష్యత్తులో జరగబోయే అద్భుతాల కోసం మనమంతా విధిగా ఎదురుచూడాలి. ఎందుకంటే రామాయణంలో గుహుడు ఎదురుచూశాడు. శబరి అలాగే ఎదురుచూసింది. కౌసల్య ఎదురు చూసింది. దశరథుడు ఎదురుచూశాడు. అయోధ్య ఎదురుచూసింది కూడా శ్రీరాముడి జననం కోసం. అలాగే ఇప్పుడంతా ప్రపంచమంతా అయోధ్య రాముడి ఆలయం కోసం ఎదురు చూస్తోంది. శతాబ్దాల స్వప్నం సాకారం అయ్యే ఘడియలు సమీపిస్తున్నాయి. ప్రపంచంలోని ప్రముఖులంతా హాజరుకాబోతున్న ఈ మహా సంబురం వేళ అయోధ్య సరికొత్తగా తనను తాను ఆవిష్కరించుకుంటోంది. విశ్వ ఆధ్యాత్మిక నగరిగా విరాజిల్లుతున్న అయోధ్యలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక పరిమళాలతో విరాజిల్లబోతోంది. లక్షలమంది హాజరయ్యే భవ్య రామమందిర మహా సంరంభ వేడుకకు నభూతో నభవిష్యత్ అన్నరీతిలో ఏర్పాట్లు జరిగాయి. ఈ మహాత్కార్యంలో తామూ భాగస్వాములయ్యేందుకు భక్తజనం ఉవ్విళ్లూరుతోంది.

22న రామ్‌లల్లా విగ్రహా ప్రతిష్టాపన..భవ్య కార్యక్రమానికి దివ్య ముహూర్తం నిర్ణయమైంది. ఆ రోజు మధ్యాహ్నం సరిగ్గా 12 గంటల 29 నిమిషాల 8 సెకన్ల నుంచి 12 గంటల 30 నిమిషాల 32 సెకన్ల శుభ ముహూర్తాన విగ్రహ ప్రతిష్టాపన జరగనుంది. అంటే శతాబ్దాల యావత్ హిందువుల కల 84 సెకన్లలో పరిపూర్ణమవుతుంది. మేషలగ్నంలో అభిజిత్ ముహూర్తంలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరగ నుంది. ఆ పవిత్ర సమయంలో గురు ఉచ్చస్థితి ఉండవల్ల రాజయోగం కలుగుతుంది. సాధారంగా 5 గ్రహాలు అనుకూలంగా ఉంటే అది అత్యంత శుభముహూర్తంగా పరిగణిస్తారు. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట సమయంలో ఆరు గ్రహాలు అనుకూలంగా ఉండడం మరో విశేషం. భూకంపాలు..సునామీ..ఎలాంటి ప్రళయాలు వచ్చినా సరే..అయోధ్య టీవీ ఇసుమంత కూడా చెక్కు చెదరకుండా అయోధ్య భవ్య రామమందిరం నిర్మాణం సాగింది. ఈ అర్కిటెక్చర్‌ను చూసి ప్రపంచం అబ్బురపడుతోంది. ఇక కొందరిలో మరో శంక కలుగుతోంది. దీనిపైనా రాజకీయాలు నడుస్తున్నాయి. విగ్రహ ప్రతిష్టాపన జరుగకుండానే...పూజలు చేయకుండానే అక్షతలు ఎలా వచ్చాయి అని చాలా మందికి సందేహం కలిగింది. చాలామంది ఇదే వారి సందేహమని అన్నారు. మనకు పంపిణీ చేస్తున్న అక్షింతలు విగ్రహ పూజకి సంబంధించినవి కావు. వాటిని అక్కడి పురోహితులు విజయ 'అక్షతలు'అని వర్ణించారు. 500 సంవత్సరాల పోరాటం తరువాత రాముని ఆలయ నిర్మాణానికి మనకు అవకాశం దక్కింది కనుక, ఆలయ నిర్మాణాన్ని విజయంగా భావించి, నిర్మాణం జరిగిన తరువాత, బాల రాముని సన్నిధిని కలిగిన ఆలయ ప్రాంగణంలో, విజయ అక్షతలను బియ్యమూ,పసుపూ ఆవునెయ్యిలతో వేద మంత్రోచ్చారణ చేస్తూ కలిపి ఇంటింటికీ పంపించాలని సంకల్పించారు. రాముడు వనవాసం తరువాత అయోధ్యకి తిరిగి వస్తుండగా అందరూ అక్షతలూ పూలూ చేతులలో పట్టుకుని ఆయన రాగానే వాటిని చల్లి.. ఆహ్వానం పలికారట. అలాగే మరల అయోధ్య లో రాముని ప్రతిష్ఠ జరిగినప్పుడు ఆ ఆలయంలో ముందుగా తయారైన ఈ 'విజయ అక్షతలు' మనం ఇంట్లో పూజకు వాడి శిరస్సున ధరించాలని ఉద్దేశ్యం. అక్షయమైనవి అక్షింతలు. క్షయము లేనివి, రామ రాజ్యము అక్షయముగా ఉండాలని కోరుతూ మనందరం విగ్రహ ప్రతిష్ఠ రోజున అయోధ్య దగ్గరలో ఉండి అక్షతలు వేయలేకపోయినా ఇంట్లోనే ఉండి ఆలయ ప్రాంగణంలో తయారైన విజయ అక్షతలతో పూజ చేసుకుని వాటిని శిరస్సున ధరించవచ్చు. క్రింద పడితే తొక్కుతామనే సందేహం ఉంటే పూజలో వాడిన అక్షింతలని నైవేద్యం కోసం వాడుకోవచ్చు. ఇకపోతే అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సంప్రోక్షణ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గురువారం గర్భగుడి లోపల విగ్రహం ఉంచిన ఫొటోలు విడుదల కాగా.. ఆ విగ్రహం తలపై పసుపు గుడ్డ కప్పి ఉంచారు. ఈ విగ్రహం బాల రాముడి ముఖంతో పాటు బంగారు విల్లు, బాణాన్ని పట్టుకున్నట్లు చూపిస్తోంది. ఐదు ఏళ్ల ప్రాయంలో రామచంద్రుడు బంగారు విల్లు, బాణం పట్టుకుని నిలబడి ఉన్న భంగిమలో దర్శనం ఇస్తున్నాడు. మొత్తంగా మనమంతా అయోధ్య సంకల్పంతో ముందుకు సాగాల్సిన సమయమిది. ధర్మరక్షణకు మనమంతా కట్టుబడి ఉంటామని ప్రతిన చేయాల్సిన తరుణమిది.

## వెంకటేశ్వర స్వామి పేరు మీద ఆదరణ ఫౌండేషన్‌లో అన్నదానం



**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి,మాగి ముఖేష్ జనవరి 20:** మధిర పట్టణం సుశీల డిగ్రీ కాలేజ్ రోడ్ లో ఆదరణ సేవ ఫౌండేషన్ లో తల్లాపురెడ్డి అశోక్ రెడ్డి లక్ష్మి శంకర్ మని వర్ధన్ రెడ్డి దేవిశ్రీ నారాయణమ్మ సహకారంతో వెంకటేశ్వర స్వామి పేరు మీద శనివారం నాడు వృద్ధుల కి మతిస్థిమితం లేని వారికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి హరిణి భోజనం అందజేసిన అశోక్ కి కుటుంబ సభ్యులకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అభివృద్ధిపై ముందడుగు పడేనా..?

- గతానికి భిన్నంగా వ్యవహరించడం లేదని ఆదిలోనే విమర్శలు
- చుట్టూ ఉండే నాయకులతో బేజారవుతున్న నిజమైన నాయకులు



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జి. శ్రీనివాస యాదవ్ జగత్ పల్లి జనవరి 21:** వనపర్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులపై అడుగు ముందుకు పడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ దిశగా ఇప్పటివరకు ప్రాథమికంగా కార్యాచరణ కూడా అగుపించడం లేదు. దీంతో నియోజకవర్గంలో కొత్త అభివృద్ధి పనుల సంగతి దేవుడెరుగు కానీ అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులపై పురోగతి కనిపించకపోవడంతో ప్రజల్లో అసహనం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సైతం మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మెగా రెడ్డి, వివిధ శాఖల అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన నర్సింగ్, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల నిర్మాణాలతోపాటు పాలిటెక్నిక్ కళాశాల పునర్నిర్మాణం కోసం 22 కోట్లు హాస్టల్ భవనాల నిర్మాణం కోసం 8 కోట్లు మంజూరైనా పనుల ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవడంలో అధికారులను సమన్వయ పరచడంలో ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన ఎమ్మెల్యే మెగా రెడ్డి కొంత వెనకబడుతున్నారని ప్రజల్లో చర్చ మొదలైంది. దీనికి తోడు జిల్లా కేంద్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు గత ప్రభుత్వ హయాంలో ఎక్కడి వరకు జరిగాయో అక్కడి వరకే జరిగి ఆగిపోయాయి. మిగతా పనులు ఏమాత్రం మొదలు కాకపోవడంతో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ఎమ్మెల్యే మెగా రెడ్డి పై ఒత్తిడి తెచ్చేందుకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఇటీవలే వెల్లడించారు. అదేవిధంగా పట్టణ నడిబొడ్డున న్యూ గంజ్ లో అత్యాధునిక హక్కులతో నిర్మించిన టౌన్ హాల్ తో పాటు సమీకృత మార్కెట్ భవనం పూర్తయి ప్రారంభించినా నేటికీ అందుబాటులోకి తేవడం లేదు. అలాగే నాగవరం శివారులో ఐటీ టవర్ నిర్మాణం కోసం గత ప్రభుత్వం చివరి దశలో పది కోట్లతో చేపట్టేందుకు స్థల సేకరణ చేసి భూమి చదును చేసినా అది కూడా స్థల సేకరణతోనే సరిపెట్టారు.

**ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టించే వారే అధికం**

తన వ్యక్తిగత ఇమేజీతో పాటు కాంగ్రెస్ గాలిలో అనూహ్యంగా ఎమ్మెల్యేగా గెలిచిన మెగా రెడ్డి గెలుపు పై ప్రజల్లో హర్షతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎంపీపీ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన మేఘారెడ్డిని మచ్చిక చేసుకునేందుకు తన వెన్నంటే ఉన్న నేతలు కొందరు పడరాని పాట్లు పడుతున్నారు. ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టించే రీతిలో సలహాలు సూచనలు ఇస్తున్నారని నియోజకవర్గ వ్యాప్తంగా మరీ ముఖ్యంగా జిల్లా కేంద్రంలో విద్యావంతులు, మేధావులు చర్చించుకుంటూ ఉండడం గమనార్హం. శాఖల వారీగా పట్టు సాధించేందుకు ఎమ్మెల్యేకు తగిన సలహాలు సూచనలు ఇచ్చే పరిజ్ఞానం కలిగిన నాయకులు లేరని బాహటంగా చర్చ జరుగుతోంది. మేఘారెడ్డికి ఎన్నికల్లో అనుకూలంగా లేని కొందరు కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ వైపు మొగ్గు చూపారు. అలాంటి కాంగ్రెస్ నాయకుల ఇంటికి కొందరు స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేగారెడ్డిని తీసుకెళ్లి అభూతకల్పనలతో ఎమ్మెల్యేను భ్రమింప చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే షెడ్యూల్ సమాచారం మొదలుకొని ఇతర ఏ కార్యక్రమాల్లోనూ పరిపక్వత లేని మేధావులు ఉండడం వల్లే ఎమ్మెల్యే పై ఆశలు పెట్టుకున్న రీతిలో పోకడలు లేవని పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా రైస్ మిల్లులు, మైనింగ్, వస్త్ర దుకాణాల్లో ఎమ్మెల్యే అనుచరులమంటూ డబ్బులు వసూలు చేసిన ఉదంతాలు ఎమ్మెల్యే పక్కన ఉన్న మహా మేధావులేనని తెలుసుకున్న ఆయన ఇటీవల తన పేరిట డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించబోనని ప్రకటన చేయడం వారి పనితీరుకు నిదర్శనమని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మెగా రెడ్డి విషయ పరిజ్ఞానం కలిగిన వారితో సంప్రదింపులు జరిపి ముందుకు సాగితేనే మిగిలిపోయిన పనులే కాదు కొత్త పనులకు కూడా అంకురార్పణ కూడా జరిగే అవకాశం ఉంటుంది.

## నూతన మీసేవ కేంద్రాల నిర్వహణ దరఖాస్తులకు ఈ నెల 23 తుదిగడువు

- రెవిన్యూ అదనపు కలెక్టర్ కే సీతారామారావు



**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ జనవరి 20**

నాగర్ కర్నూలు జిల్లాలోని కోడేరు, వంగూరు, తాడూరు మండలాల్లోని తీగలపల్లి, మైలారం, కొండారెడ్డిపల్లి, తాడూరు కేంద్రాలలో మీసేవ నిర్వహణకు,అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఈనెల 23వ తేదీలోగా చేసుకోవాల్సిందిగా నాగర్ కర్నూల్ జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ కే సీతారామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మీసేవ నిర్వహణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 నుండి 35 సంవత్సరాలలోబడి స్థానికులై ఉండాలని, డిగ్రీ అర్హతతో పాటు, కంప్యూటర్ పరిజ్ఞానం కచ్చితంగా ఉండాలని ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్ ఈ గవర్నెన్స్ సెక్రటరీ వారి పేరు మీద 500 రూపాయల డీడీని జతపరిచి, ఆసక్తిగల అభ్యర్థులు జనవరి 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ అర్జీలను(దరఖాస్తు ఫారాలను) ఆయా మండలాల తహసిల్దార్ కార్యాలయల్లో అందజేయాలని, అదనపు కలెక్టర్ కే సీతారామారావు ప్రకటనలో తెలిపారు.

## పాపన్న విగ్రహ ప్రతిష్టాపన గద్దెను కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

- గౌడ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బూరుగు శ్రీకాంత్ గౌడ్..



**తొర్రూర్ (నేటి ఫోకస్ న్యూస్)జనవరి 20:** బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపన గద్దెను కూల్చిన దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకొని అదే చోట విగ్రహాన్ని బేషరతుగా నిర్మించాలని గౌడ సంక్షేమ సంఘం మానుకోట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బూరుగు శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జనగామ జిల్లా తరిగొప్పులలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రతిష్టించడానికి గౌడ సోదరులు గద్దెను ఏర్పాటు చేస్తే జీర్ణించుకోలేక అదే గ్రామానికి చెందిన కొంతమంది దుర్మార్గులు రాత్రి సమయంలో గద్దెను కూల్చివేయడం దారుణమని మండిపడ్డారు. గద్దెను కూల్చి వేసిన మాశెట్టి వేణుగోపాల్, శ్రీనివాస్, సందీప్ మరియు వారి అనుచరులను ప్రభుత్వపరంగా కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు పోలీసు అధికారులను కోరారు. గతంలో ఐనవోలు మండలం నందనం గ్రామంలో ఇదే ఘటన చోటుచేసుకుందని, రాజకీయాలకు అతీతంగా గౌడ సంఘాలన్ని ఒక్కటై, గ్రామస్తుల సహకారంతో పాపన్న గద్దె కూల్చివేతకు పాల్పడిన వారితో బహిరంగంగా క్షమాపణ చెప్పించి అదే స్థలంలో గద్దె నిర్మించి పాపన్న విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగిందని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు మరల పునరావృతమైతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండ యాకన్న గౌడ్, గాడిపెల్లి సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ



**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు జనవరి 20:** 2024 షెడ్యూలు పురస్కరించుకొని,(తేదీ.20%డ%21-01-2023) రెండు రోజులు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం లో భాగంగా శనివారం నాడు శ్రీ జి గణేష్,ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ మరియు రెవెన్యూ డివిజన్ అధికారి,ఖమ్మం పోలింగ్ కేంద్రంలను సందర్శించినారు.సదరు బోనకల్ మండలం నందు ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల, కలకోట గ్రామాలలో స్కూల్స్ లో గల పోలింగు కేంద్రములో గల బూత్ లెవెల్ అధికారులు వారు క్లైములు స్వీకరించినట్టివి.విచారణ క్రమము విధానమును మరియు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు క్లైములు వచ్చినవి,మరియు వాటి విచారణ విధానము పరిశీలించినారు.ఆర్డీఓ గణేశ్ వెంట తాసిల్దార్ తాసిల్దార్ పున్న%శీ%చందర్ మరియు జి.లక్ష్మణ్,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మరియు పై గ్రామాల బూతు లెవల్ అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు హాజరైనారు.

## జర్నలిస్ట్ పార్ధివదేహానికి మాజీమంత్రి ఘన నివాళి..

- తొర్రూర్ వర్కింగ్ జర్నలిస్ట్ బోగోజు సురేష్ అకాల మరణం...



**తొర్రూర్ (నేటి ఫోకస్ న్యూస్)జనవరి 20:** తొర్రూర్ పట్టణ కేంద్రంలో గత పది సంవత్సరాలుగా నిరుపేదల సమస్యలను తన కలంతో బహిర్గతం చేస్తూ నిరుపేదల పక్షపాతిగా, నిస్వార్థ సేవకు నిదర్శనంగా, మృదుస్వభావిగా పేరు గడించిన స్వతంత్ర టీవీ తొర్రూరు వర్కింగ్ జర్నలిస్ట్ బోగోజు సురేష్ శనివారం గుండెపోటుతో అకాల మరణం చెందగా పలువురు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి బోగోజు సురేష్ పార్ధివదేహాన్ని తొర్రూరు పట్టణ కేంద్రంలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సందర్శించి పూలమాలతో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. బోగోజు సురేష్ నిత్యం ప్రజా సమస్యలపై వెనుకంజ వెయ్యకుండా తన కలంతో గలమెత్తిన నిస్వార్థ విలేఖరి అని కొనియాడారు. అతని అకాల మరణం నిస్వార్థ వర్కింగ్ జర్నలిస్టులకు, నిరుపేద ప్రజలకు తీరని లోటని, సురేష్ అకాల మరణం తనను కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి దయన్న సురేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అకాల మరణం పొందిన సురేష్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ.. వారి కుటుంబ సభ్యులకు నా పరంగా, బిఆర్ఎస్ పార్టీ పరంగా ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియజేశారు. నివాళు లర్పించిన వారిలో జెడ్పి ఫ్లోర్ లీటర్ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ మదనపల్లి రామచంద్రయ్య, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

## వనపర్తి కలెక్టరేట్‌లో భూ సేకరణ దస్త్రాలు మాయం


- పోలీసులకు ఫిర్యాదు చేసిన జాయింట్ కలెక్టర్
- ఆరుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై కేసులు నమోదు
- రూరల్ ఎస్సై నాగన్న




**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జి. శ్రీనివాస యాదవ్ జగత్ పల్లి జనవరి 21:** వనపర్తి జిల్లా కలెక్టరేట్ లో భూ సేకరణకు సంబంధించిన దస్త్రాలు మాయమైనట్లు రూరల్ ఎస్సై నాగన్న ఒక ప్రకటనలో తెలిపారు. దస్త్రాలకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతి రావు శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడని ఆయన తెలిపారు. భూ సేకరణకు సంబంధించిన ఆరుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదే విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుపతిరావును ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. జిల్లాలో అక్రమ భూ దందాలు అధికంగా జరగడం వల్లనే దస్త్రాలు మాయం మాయం చేశారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. భూ సేకరణ దస్త్రాలకు సంబంధించి ఎమ్మెల్యే మెగా రెడ్డి తో పాటు జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ చేయించి దీని వెనక ఉన్న దొంగలను బయటకు తీసుకురావాలని కోరుతున్నారు.

# విదేశాల్లో హనుమాన్ భారీ కలెక్షన్లు

తెలుగు సినిమాకి విదేశీ మార్కెట్ ఇప్పుడు చాలా కీలకం అయింది. ముఖ్యంగా అమెరికాలో వున్న తెలుగు ప్రేక్షకులు తెలుగు సినిమాలని విపరీతంగా ప్రోత్సహిస్తారు. అందులోకి ఆ సినిమా బాగుంటే, ఇక ఆ సినిమాకి కాసుల వర్షమే కురుస్తుంది అక్కడ. సంక్రాంతి పండగకి తెలుగు సినిమాలు నాలుగు విడుదలయితే, అందులో చిన్న సినిమా అయిన 'హనుమాన్' సంచలనం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమా లో తేజ సజ్జ కథానాయకుడు, నిరంజన్ రెడ్డి నిర్మాత. ఈ సినిమా ఇప్పుడు ఇంకో చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు విడుదలైన తెలుగు సినిమాలలో ఈ చిన్న సినిమా అయిన 'హనుమాన్' ఎక్కువ కలెక్షన్స్ చేసిన మొదటి ఐదు సినిమాల్లో ఒకటిగా చేరింది. ఇది మొత్తం చలన చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు విడుదలైన సినిమాలన్నిట్లో ఐదో సినిమాగా నిలిచింది అంటే, ఈ 'హనుమాన్' ఒక చరిత్ర సృష్టిస్తోంది అనే చెప్పాలి. మొదటి నాలుగు సినిమాలు పెద్ద నటులు, పెద్ద దర్శకులు, పెద్ద బ్జడెట్ సినిమాలు కావటం, వారితో పోలిస్తే పోలిస్తే 'హనుమాన్' లాంటి చిన్న సినిమా వాటి పక్కన ఉండటం నిజంగా ఒక అద్భుతమే అని చెప్పాలి. విదేశీ మార్కెట్ లో బాక్స్ ఆఫీస్ దగ్గర ఎక్కువ కలెక్షన్స్ పొందిన మొదటి నాలుగు సినిమాలు వరసగా బాహుబలి 2, ఆర్ఆర్ఆర్, సలార్, బాహుబలి 1 కావటం విశేషం. ఇప్పుడు ఐదో సినిమాగా 'హనుమాన్' చేరటం ఒక చరిత్ర, అద్భుతం. ఈ సినిమా ఇంకా నడుస్తోంది, ఇంకా ఎక్కువ కలెక్టు చేసే అవకాశం కూడా వుంది.




# అందాల ఆరబోతలో కృతి సనన్



హిందీ పరిశ్రమలో ఇప్పుడు అగ్ర నటీమణుల్లో వున్న కృతి సనన్ అందాల ఆరబోతలో ముందున్నది. తన అందచందాలతో కుర్రాకరును పిచ్చెక్కిస్తోంది. మొదటి సినిమా తెలుగు సూపర్ స్టార్ మహేష్ బాబు పక్కన '1: నేనొక్కడినే' సినిమాలో కథానాయికగా నటించింది. కృతి సనన్ ఆ తరువాత మరొక్క తెలుగు సినిమా మాత్రమే చేసింది. తరువాత హిందీ పరిశ్రమకి వెళ్ళిపోయింది.గత సంవత్సరం కృతి సనన్ హిందీ సినిమాలు మూడు విడుదలయ్యాయి. అందులో అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్ లో వచ్చిన 'అల వైకుంఠపురంలో' సినిమాని హిందీలో 'షెహ జాద' అనే పేరు మీద రీమేక్ చేశారు. ఇందులో కార్తీక్ ఆర్యన్ కథానాయకుడు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర నడవలేదు. తరువాత తెలుగు నటుడు ప్రభాస్ తో పాన్ ఇండియన్ సినిమాగా 'ఆదిపురుష్' లో సీతామాతగా కృతి సనన్ చేసింది. కానీ ఈ సినిమాకి వచ్చినన్ని విమర్శలు ఇంకే సినిమాకీ రాలేదేమో అనిపిస్తుంది. తరువాత 'గణపత్' అని ఇంకో సినిమా విడుదలైంది. టైగర్ ష్రాఫ్ ఈ సినిమాలో రెండు పాత్రల్లో కనపడితే, కృతి సనన్ కథానాయికగా నటించింది. ఇందులో లెజెండరీ నటుడు అమితాబ్ బచ్చన్ ఒక ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. అయినా ఈ సినిమా కూడా బాక్స్ ఆఫీస్ దగ్గర చతికల బడింది. కానీ సంతోషకరమైన వార్త ఏంటంటే, గత సంవత్సరం జాతీయ అవార్డు అందుకున్న వాళ్లలో కృతి సనన్ కూడా వుంది. 'మిమి' సినిమాలో ఆమె చేసిన పాత్రకి గాను ఉత్తమ నటిగా కృతి సనన్ ఈ జాతీయ అవార్డు అందుకుంది. ఈ సంవత్సరం కృతి సనన్ సినిమా 'తెరి బాతొన్ మె ఐసా ఉజా జియా' వచ్చేనెల అంటే ఫిబ్రవరి 9న విడుదలవుతోంది. షాహిద్ కపూర్ కథానాయకుడు, ఇందులో కృతి సనన్ ఒక రోబోట్ గా కనిపించనుంది. ఈ సినిమా ట్రైలర్, పాటలు చూస్తే ఆమె రోబోట్ గా చేసింది అని అర్థం అవుతోంది. ఈ సినిమా ప్రచారాలు మొదలుపెట్టేసింది కృతి సనన్. ఆ సందర్భంగా తీసిన ఫోటోలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. ఈ సినిమా అయినా విజయం సాధిస్తుందని, కృతి సనన్ ఈ సంవత్సరం విజయంతో మొదలు పెడుతుందని ఆమె అభిమానులు ఎదురు చూస్తున్నారు.

## దేవరతో పోటీ పడనున్న
# అక్షయ్ సినిమా




బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ , టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బడే మియాన్ చోటే మియాన్' .ఈ సినిమాకు అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తుండగా.. మానుషి చిల్లర్, సోనాక్షి సిన్హా కథనాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ ఆకట్టుకుంటుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్‌తో పాటు రిలీజ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాను రంజాన్ కానుకగా ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీనితో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ గన్స్ పట్టుకోని ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నారు. ఇక ఈ సినిమా టీజర్‌ను రిపబ్లిక్ కానుకగా జనవరి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే మరోవైపు రంజాన్ కానుకగా టాలీవుడ్ నుంచి మరో పాన్ ఇండియా సినిమా రిలీజ్ కాబోతుంది. టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ నటిస్తున్న దేవర చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. దీంతో ఈ రెండు సినిమాల మధ్య ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

# నాని సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులు పొందిన దిల్ రాజు





నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' షూటింగ్ జరుగుతోంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తోంది. ఇందులో ప్రముఖ తమిళ నటుడు ఎస్ జె సూర్య విలన్ పాత్రలో కనపడతారు. డీవీవీ దానయ్య దీనికి నిర్మాత. శనివారంనాడు ఈ సినిమా గురించి ఒక ముఖ్యమైన వార్త ఈరోజు విడుదల చేశారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు, అతని సోదరుడు శిరీష్ నిర్మాణ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ 'సరిపోదా శనివారం' సినిమా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డిస్టిబ్యూష్రన్ హక్కులు తీసుకున్నట్టుగా సామజిక మాధ్యమం వేదికగా ప్రకటించింది. శనివారం కావటంతో ఈ సినిమా టైటిల్ కూడా అలాగే ఉండటంతో ఈరోజు ఈ ప్రకటన రావటం ఆసక్తికరం. ఇలా సినిమా నిర్మాణంలో ఉండగానే థియేటర్ హక్కులు కొనుక్కోవటం పరిశ్రమలో ఒక చర్చగా నడుస్తోంది. ఈ సినిమా మీద ఇప్పటికే క్రేజ్ ఉన్నప్పటికీ, దిల్ రాజు ఇలా థియేటర్ హక్కులు తీసుకోవటంతో మరింత ఆసక్తికరం పెరిగింది అని అంటున్నారు. ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుంది అని కూడా తెలుస్తోంది.